క్లుప్తంగా

ప్రమాణస్వీకారాన్ని జయప్రదం చేయాలి

కురిచేడు: దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఒంగోలు తరలి రావాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి కోరారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పార్టీ కన్వీనర్లు, గ్రామ కమిటీ కన్వీనరులు, సచివాలయ కన్వీనర్లు, సొసైటీ ప్రెసిడెంట్లు, మాజీ ప్రెసిడెంట్లు, అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

రెండు బైకుల ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కంభం: ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం రాత్రి తర్లుపాడు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని ఔరంగబాద్ గ్రామానికి చెందిన వరికుంట్ల శ్రీనివాసులు బైక్‌పై కంభం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులుకు తీవ్రగాయాలు కాగా మరో బైక్‌పై ఉన్న ఓ వ్యక్తి, ఇంకో మహిళకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నూతన మద్యం పాలసీ నోటిఫికేషన్ విడుదల

మార్కాపురం టౌన్: నూతన మద్యం పాలసీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం జారీ చేసిందని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరెడ్డి గురువారం తెలిపారు. మార్కాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మార్కాపురం మున్సిపాలిటీ, మార్కాపురం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాలకు 13 మద్యం దుకాణాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈనెల 11న లాటరీ ద్వారా లైసెన్స్ కేటాయిస్తారని, 12 నుంచి నూతన దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివార్లలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు. కాలనీలోని ఓ పాడుబడిన భవనంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామని చెప్పారు. నిందితుల నుంచి రూ.1650 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తెల్లదిన్నెలో వీధిలైట్లు ఏర్పాటు

కంభం: మండలంలోని ఎల్‌కోట పంచాయతీ పరిధిలోని తెల్లదిన్నె గ్రామంలో అధికారులు వీధి లైట్లు ఏర్పాటు చేశారు. గ్రామంలో గత ఆరు నెలలుగా వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఈ నెల ఒకటో తేదీన 'అంధకారంలో తెల్లదిన్నె' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామంలోని విద్యుత్ స్తంభాలకు కొత్త వీధిలైట్లు ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ర్యాగింగ్ చేస్తే జైలుకే..

మార్కాపురం: కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే జైలుకు పంపుతామని రూరల్ ఎస్సై అంకమరావు హెచ్చరించారు. గురువారం స్థానిక జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. ర్యాగింగ్ చేసిన వారిపై కేసులు నమోదుచేస్తే భవిష్యత్తులో ఉద్యోగాలు రావని, విదేశాలకు వెళ్లలేరని, ఉన్నత చదువులు చదవలేరని హెచ్చరించారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చే దిశగా విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ రాజబాబు మాట్లాడుతూ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ మస్తానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం


దర్శి బాలాత్రిపురసుందరీ దేవిగా దర్శనం ఇస్తున్న గుంటి గంగా భవానీ అమ్మవారు


దర్శి: బాలా త్రిపురసుందరీ దేవిగా కనకదుర్గమ్మ తల్లి


దర్శి: బాలా త్రిపురసుందరీ దేవిగా దద్దాలమ్మ అమ్మవారు


పెద్దారవీడు: ప్రత్యేక అలంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు


దర్శి: బాలాత్రిపురసుందరీ దేవిగా పోలేరమ్మ అమ్మవారు


పుల్లలచెరువు: బాలాత్రిపుర సుందరీదేవిగా రేణుక ఎల్లమ్మ

పెద్దదోర్నాల: దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు స్వస్తిశ్రీ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి గురువారం నుంచి పలు దేవాలయాల్లో గణపతి పూజతో వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. వేద పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి విశేష పూజలు చేశారు. మండల కేంద్రంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రులు వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజల అనంతరం అమ్మవారి మూల వీరాట్‌కు మహిళా భక్తులు ఆవు పాలతో అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు బెదరె రాంప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి శుద్ధ జలాభిషేకం, క్షీరాభిషేకం, ఫలోదాభిషేకం, పంచామృత స్నానాలు నిర్వహించగా సాయంత్రం సహస్ర నామార్చనను నిర్వహించారు. అమ్మవారికి మహాన్యాస పూర్వక ఏకా రుద్రాభిషేకం, చండీ పారాయణ హోమం చేశారు. ఉదయం 9.30 గంటలకు ఆలయంలో కలశస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పసిడి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గురువారం రాత్రి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి లక్ష కుంకుమార్చన తదితర కార్యక్రమాలను ఆలయ ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు నిర్వహించారు. స్థానిక పోలేరమ్మ ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయంలో అమ్మవారికి కుంకుమార్చన, సహస్రనామార్చన, నవగ్రహ మండపారాధన, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

త్రిపుర సుందరిగా ఈశ్వరీదేవి

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో దేవీ నవ శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం బాల త్రిపుర సుందరిగా ఈశ్వరీదేవి దర్శనమిచ్చారు. ఉదయం 7 గంటల నుంచి పంచామృత అభిషేకాలు, శ్రీసూక్త లలిత అష్టోత్తర శత నామావళి, అష్టోత్తర కుంకుమ పూజలు నిర్వహించారు. పురోహితులు మణిబాబు శర్మ అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహా నైవేద్యం చెల్లించారు. మంగళ హారతులిచ్చారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెదన్నపాలేనికి చెందిన వెంకట ప్రసన్న ఆంజనేయరెడ్డి భక్తులకు అల్పాహారం అందించారు. శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రుల స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం అమ్మవారు వేద గాయత్రీగా దర్శనమిస్తుందని బైరవానంద స్వామి తెలిపారు.

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వైభవంగా ప్రారంభమయ్యాయి. త్రిపురాంతకం శ్రీబాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో గురువారం తెల్లవారుజాము నుంచి మంగళవాయిద్యాలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి అభిషేకం, కాలపూజ, బాలభోగం, గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన, అఖండస్థాపన, మండపారాధన, అష్టదిగ్పాలకులపూజ, సప్తశతీపారాయణం వేదపండితులు నాగఫణిశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. రోజూ గోపూజ, ఉభయదాతల పూజలు, బాలపూజ, కుంకుమార్చనలు, ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజ, పరాకులు, మంత్రపుష్పం, చండీహోమం వేదపండితులచే జరిగాయి. అర్చకుడు ప్రసాదశర్మ భక్తులతో ప్రత్యేక పూజలు జరిపించారు. శరన్నవరాత్రి మహోత్సవాలు పల్లకీ సేవ అమ్మవారి ఉత్సవమూర్తి ఉత్సవంతో ప్రారంభమయ్యాయి. ఆలయాల వద్ద భక్తులకు ఏర్పాట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

కురిచేడు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజు గురువారం స్థానిక శ్రీ జ్ఞానప్రసూనాంబ దేవి భక్తులకు పార్వతిదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు పూజారి నారాయణం వెంకటేశ్వర్లు భక్తులతో చేయించారు.

పెద్దారవీడు: మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లెలో శ్రీ గొబ్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాజ్యలక్ష్మి అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాజ్యలక్ష్మి అమ్మవారు శుద్ధలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల ఆలయాల్లో గురువారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ముటుకుల శ్రీ రేణుక ఎల్లమ్మదేవి ఆలయంలో ఆలయ అర్చకులు భరద్వాజశాస్త్రి ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు అమ్మవారిని శ్రీ బాల త్రిపురసుందరీ దేవి అవతారంగా భక్తులకు అమ్మవారు దర్శనం ఇచ్చారు. భక్తులు విరివిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడివరం రామాలయం, పుల్లలచెరువు బ్రహ్మంగారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


దర్శి: వాసవీ కన్యకా పరమేశ్వరిగా దర్శనం ఇస్తున్న అమ్మవారు


కురిచేడు: పార్వతీదేవిగా శ్రీ జ్ఞానప్రసూనాంబదేవి


బాలాత్రిపుర సుందరిగా ఈశ్వరీదేవి

దర్శి: నియోజకవర్గంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా మొదటి రోజు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి తెల్లవారు జామున ప్రత్యేక అభిషేకాలు చేశారు. అమ్మవారిని పూల మాలలతో అందంగా అలంకరించారు. మధ్యాహ్నం అందరికీ అన్నదానం చేశారు. పట్టణంలోని దద్దాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు వాసవి కన్యకా పరమేశ్వరి దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని పోలేరమ్మ ఆలయంలో పోలేరమ్మ తల్లి బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారని పూలమాలలతో అందంగా అలంకరించారు. తాళ్లూరు మండలంలో ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీ గుంటి గంగా భవాని అమ్మవారు మొదటి రోజు బాల త్రిపుర సుందరీ దేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారిని అందంగా పూల మాలలతో అలంకరించారు.


కురిచేడు: వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి..


త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి


బత్తాయి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

- నిమ్మ, బత్తాయి తోటల పునరుద్ధరణపై రైతులకు శిక్షణ

తాళ్లూరు (దర్శి): నిమ్మ, బత్తాయి తోటల్లో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఉద్యాన వన పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రవీంద్రబాబు సూచించారు. బత్తాయి, నిమ్మతోటల్లో తెగుళ్ల పునరుద్ధరణపై రైతులకు అవగాహన కార్యక్రమం మండలంలోని నాగంబొట్లపాలెంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యాన వన పరిశోధనా క్షేత్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రవీంద్రబాబు, ఉద్యాన అధికారి ఎం.రవిలు పాల్గొని పలు సూచనలు, సలహాలు అందజేశారు. శాస్త్రవేత్త రవీంద్రబాబు మాట్లాడుతూ బత్తాయి తోటల్లో కొమ్మల కత్తిరింపుల గురించి వివరించారు. బత్తాయి సాగులో వచ్చే పురుగులు, తెగుళ్ల లక్షణాలు, వాటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. బత్తాయిలో ప్రధానంగా వేరు కుళ్లు తెగుళ్లు అధిక నష్టాన్ని కలుగజేస్తున్నాయన్నారు. నివారణకు కార్బండిజం ఒక గ్రాము లీటరు నీటికి లేదా సాఫ్ మూడు గ్రాముల లీటరు నీటికి చొప్పున కలిపి మొక్క పాదుల్లో పోయడం ద్వారా నివారించవచ్చని వివరించారు. ట్రైకో డెర్మావిరిడి రెండు కేజీలు, 100 గ్రాముల పశువుల ఎరువులో కలిపి మొక్క పాదుల్లో ఆరు నెలలకు ఒకసారి మేయడం ద్వారా వేరుకుళ్లు తెగులు బత్తాయికి ఆశించకుండా నివారించవచ్చన్నారు. పల్లాకు తెగులు నివారణకు సూక్ష్మధాతువుల మిశ్రమాన్ని ఐదు కేజీలు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మండల ఉద్యాన శాఖ అధికారి ఎం. రవిబాబు మాట్లాడుతూ బత్తాయి తోటల్లో కాపు కాయ కోత అనంతరం ఎండు పల్లలను, పనికి రాని కొమ్మలను కత్తిరించి బ్లైటాక్స్ మూడు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని, చెట్టు మొదలుకు బార్డో పేస్టు పూసుకోవాలని వివరించారు. రైతులకు అమలవుతున్న పథకాలు గురించి వివరించారు. గ్రామ సహాయకులు డి.శ్రీను, ఊసీఆర్పీ వాణి, గ్రామ రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త రవీంద్రబాబు

ఫ్లోరోసిస్ వ్యాధిని గుర్తించండి


ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముండ్లమూరు (దర్శి): మండలంలో ఫ్లోరోసిస్ వ్యాధి ఉంటే వారిని వెంటనే గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని ఫ్లోరోసిస్ ప్రోగ్రాం కన్సల్‌టెంట్ వి.అనిల్‌కుమార్ సూచించారు. మండలంలోని మారెళ్లలో ఫ్లోరోసిస్‌పై గురువారం సర్వే చేశారు. పాఠశాలల్లో విద్యార్థులను పరిశీలించారు. ఈ సందర్భంగా అనీల్‌కుమార్ మాట్లాడుతూ ఎవరికైనా కాళ్లు వంకర్లు, చేతుల ఎముకలు వంకర్లు ఉంటే ఆ ఎముకను ఫ్లోరోసిస్‌గా గుర్తిస్తారని చెప్పారు. ఆల్కహాల్, కాఫీ, టీ, బీడీ, చుట్ట, పొగాకు వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రజలు తాగే నీటి గురించి వాకబు చేశారు. క్యాల్షియం, జింక్, విటమిన్ సీ తప్పని సరిగా వాడాలని సూచించారు. పూరిమిట్లలో పబ్లిక్ టాప్ నుంచి శాంపిల్, ఆర్వోప్లాంట్ నుంచి శాంపిళ్లు ఫ్లోరోసిస్ పరీక్షల కోసం తీసుకెళ్లారు. మారెళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి బి.మధుశంకర్, సీహెచ్‌ఓ డి.వెంకట్రావు,వైద్యసిబ్బందిలక్ష్మి పాల్గొన్నారు.

త్రిపురాంతకం ఎంపీడీఓగా రాజ్‌కుమార్

త్రిపురాంతకం: మండల కేంద్రం త్రిపురాంతకం ఎంపీడీఓగా జి.రాజ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆయన పెద్దారవీడు మండలంలో విధులు నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీపీ గొట్టిముక్కుల రిబకమ్మ, అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి


తాళ్లూరు: దారంవారిపాలెంలో రైతులు, వ్యవసాయాధికారులు

పుల్లలచెరువు: ప్రతి పంట సాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంతో నాణ్యమై అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి నిర్మలాదేవి సూచించారు. గురువారం మండలంలోని శతకోడు, మర్రివేముల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడితే ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో మెట్ట పొలాల్లో వేసిన కంది పంటకు గూడు పురుగు వచ్చే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీఏహెచ్ఎ పద్మానాభరావు మాట్లాడుతూ పశువుల షెడ్ వేసుకునేందుకు ప్రభుత్వం రాయితీపై అవకాశం కల్పించదని, కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీఏఏలు మస్తాన్, మంత్రునాయక్, రైతులు పాల్గొన్నారు.

తాళ్లూరు (దర్శి): రైతుల సమష్టి భాగస్వామ్యంతోనే సత్ఫలితాలు వస్తాయని దర్శి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె. బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని దారంవారిపాలెం, తురకపాలెం, మన్నేపల్లి గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాలాజీనాయక్ మాట్లాడుతూ మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు, కత్తెర పురుగు నివారణకు యాంత్రిక, భౌతిక, జీవ నియంత్రణ, రసాయన పద్ధతులను అవలంభించాలన్నారు. మొక్కజొన్న క్షేత్రాలను సందర్శించి పలు సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాద్‌రావు, ప్రకృతి సాగు ఇన్‌చార్జి నరశింహులు, సర్పంచ్ ఎం.వెంకటేశ్వరరెడ్డి, వీఏఏలు నవీన్, భార్గవి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న ఏవో నిర్మలాదేవి


పెద్దదోర్నాలలో..

పెద్దదోర్నాల: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ గురువారం మండల పరిధిలోని చింతల, బోడేనాయక్ తాండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి మిర్చి, పత్తి పంటలను పరిశీలించారు. రైతులకు పంటలపై సస్య రక్షణ చర్యలు వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పరిపూర్ణ, నీలానాయక్, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ బాలునాయక్ పాల్గొన్నారు.

టిప్పర్..కారు ఢీ..ఒకరికి గాయాలు


గాయపడిన కోట నవీన్


ధ్వంసమైన కారు

కురిచేడు: మండల సరిహద్దుకు కూతవేటు దూరంలో నూజెండ్ల మండలం నరసాయపాలెం పోలేరమ్మ ఆలయం వద్ద టిప్పర్ ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. వివరాలు.. వినుకొండకు చెందిన కోట నవీన్ తన సొంత కారులో వ్యక్తిగత పనులపై దర్శి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. పోలేరమ్మ ఆయలం దాటుతుండగా వినుకొండ వైపు నుంచి కురిచేడు వేగంగా వస్తున్న టిప్పర్ స్పీడుగా వచ్చి కారును బలంగా ఢీకొట్టింది. కారు అదుపుతప్పి రోడ్డుపక్కకుపోయి ముందు భాగం నుజ్జునుజ్జయింది. కారులో ఉన్న కోట నవీన్‌కు కాలు విరిగింది. టిప్పర్ కూడా రోడ్డు పక్కకు వెళ్లి ఆగిపోయింది. 108కి సమాచారం అందించటంతో సిబ్బంది రహమాన్, ప్రసాద్ వచ్చి నవీన్‌కు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


రోడ్డుకు ఇరువైపులా పడిపోయిన చెట్లు


చెట్లు పడిపోవడంతో పొలాల నుంచి దారి చూసుకుని వెళ్తున్న బైకిస్టులు

భారీ వర్షాలకు నేలకొరిగిన చెట్లు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని ఉల్లగల్లు-రెడ్డినగర్ మధ్య గురువారం సాయంత్రం కురిసిన గాలీవానకు ఏడు పెద్ద పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. అటు ఇటూ రోడ్డు మధ్యలో చెట్లు కూలి పోవడంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు ఆగిపోయాయి. మోటారు సైకిలిస్టులు పొలాల్లో నుంచి దారి చేసుకుని వెళ్తుండగా పెద్ద పెద్ద వాహనాలు మాత్రం చెట్లు తొలగించే వరకు ఆగిపోవాల్సి వచ్చింది. దర్శి మండలంలో కూడా గాలితో కూడిన వర్షం పడింది. ఈ వర్షంతో పంటలకు మంచి జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


చెట్లు పడిపోవడంతో నిలిచిన వాహనాలు